నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 27 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




# ఆవేదన ఆలకింపు

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల గోడు విన్న సభ్యులు

- కాంగ్రెస్ పాలనలో విసుగు చెంది అఘాయిత్యాలకు పాల్పడవద్దు..
- అసెంబ్లీ, శాసనమండలిలో చర్చిస్తాం.. న్యాయం జరిగేలా చూస్తాం..
- కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా పోరాడుతాం..
- కౌలు రైతులను విస్మరించిన దగా కోరు కాంగ్రెస్ సర్కారు
- అన్నదాతల్లో ధైర్యం నింపిన రైతు అధ్యయన కమిటీ బృందం సభ్యులు

### మోసపోయి.. గోసపడుతున్నం..



### కౌలు రైతుకు సాయమేదీ?

మిర్చి రైతు ఈశ్వర్‌తో మాట్లాడుతున్న అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి

ఆదిలాబాద్, జనవరి 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. 13 నెలలుగా రైతు సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోయి నా.. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తమ వద్దకు వచ్చి తమగోడును ఆలకించడంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. చాలా రోజుల తర్వా త రైతు సమస్యల పరిష్కారానికి వేదిక దొరికిందని రైతులు అభిప్రాయపడ్డారు. కమిటీ పర్యటనలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగులో సమస్యలు బహిర్గతమయ్యాయి. పెట్టుబడి కోసం ఇబ్బందులు, బ్యాం కులు, ప్రైవేటు అప్పులు, బ్యాంకర్ల వేధింపులు, పంట నష్టం, అమ్మకాల్లో ఇబ్బందులను అధ్యయన కమిటీ బృందానికి తెలియజేశారు. కాంగ్రెస్ పాలనలో విసుగు చెందిన రైతులు ఆందోళనలు చెందవద్దని సభ్యులు సూచించారు. అన్నదాతల తరపున అసెంబ్లీ, శాసన మండలిలో తాము పోరాడుతామని, అఘాయిత్యాలకు పాల్పడవద్దని, న్యాయం కోసం పోరాడుతామని సూచించారు.

*ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ మండలం, రామాయి యాపల్‌గూడ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. రామాయిలో మిర్చి సాగు చేస్తున్న రైతు ఈశ్వర్‌తో మాట్లాడారు. కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సాయం అందుతుందని తాను ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నట్లు రైతు ఈశ్వర్ తెలిపారు. ఎకరాకు రూ. 31,600 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం అందించే డబ్బు ల్లో కొన్ని కలుపుకుని కౌలు డబ్బు లు చెల్లిద్దామనుకుంటే ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీని మరిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి మోసపోయినట్లు తెలిపారు. దీంతో తాను అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మిర్చి పంట క్వింటాలుకు రూ.28 వేల ధర రాగా, ఇప్పుడు కేవలం రూ.12 వేలు మాత్రమే వస్తున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ రూ.500 రావడం లేదని కమిటీ సభ్యులకు కౌలు రైతు ఈశ్వర్ వివరించారు.*

### కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయాం..

రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యులకు రైతులు ఏడాదికాలంలో పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేశామని, ఇప్పుడు మోసపోవాల్సి వస్తున్నదని అన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం రెండు పంటలకు రాలేదని, దీంతో అప్పులు చేసి సాగు చేయాల్సి వస్తుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరుపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు రూ. 2 లక్షల రుణం అందడం లేద ని, రేషన్‌కార్డు లేకున్నా, కుటుంబం మొత్తంలో రూ. 2 లక్షలకు రుణం ఉన్నవారికి ప్రభుత్వం మాఫీ చేయలేదని రైతులు తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ. ఒక లక్ష బ్యాంక్ లోన్ రద్దు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరు రైతులకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేయాలని కోరారు. పంటల విక్రయాల్లో ఇబ్బందులు పడుతున్నామని, కష్టపడి సాగు చేసిన పంటలకు మద్దతు ధర లభించడం లేదన్నారు. పత్తి క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. సీసీఐ రూ.100 తగ్గించి రూ.7,421 చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సం తోషంగా ఉన్నామని, ఏడాది కాంగ్రెస్ పాలనలో వ్యవసాయరంగాన్ని ప్ర భుత్వాన్ని పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ బృందం పర్యటనలో రైతుల దైన్యస్థితి వెలుగులోకి వచ్చింది.

### మహాలక్ష్మి సాయం ఎక్కడ?

కమిటీ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో శనగ పంటలో పనిచేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. వారు తమ సమస్యలను సభ్యులకు ఏకరువు పెట్టారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.12 వేలు ఏడాది గడిచినా రావడం లేదని, మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ.2500 డబ్బులు రావడం లేదన్నారు. పింఛన్లను పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం మాట మరిచిందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు అబద్ధాలు అని వారు సభ్యులకు సూచించారు.

### అన్నదాతకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్



కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడం, రైతు భరోసా ఇవ్వక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నాం. దీనికి ఇటీవల జరుగుతున్న రైతు ఆత్మహత్యలే అద్దం పడుతున్నాయి. కేసీఆర్ పాలనలో అయితే సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొలేదు. గత శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ పర్యటించి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్లో ధైర్యం నింపింది. అన్నదాతతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఈ కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారు. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలను ప్రారంభించడం, మిగతా గ్రామాలవారిని విస్మరించడం అయోమయానికి గురి చేస్తున్నది. ఇప్పటికైనా సర్కారు రైతు కూలీలకు న్యాయం చేయాలి.

*- గడ్డం లస్మన్న, రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం.*

### దిగుబడి రాలే.. రుణమాఫీ కాలే..



మా కుటుంబానికి యాపల్‌గూడ శివారులో 4.10 ఎకరాల భూమి ఉన్నది. అందులో పత్తి, కంది వేస్తాం. ఈసారి దిగుబడి రాలేదు. ధరలు కూడా లేకుండే. ఇక మహారాష్ట్ర బ్యాంకులో మాకు ఉన్న రూ.2 లక్షల రుణం మాఫీ కాలేదు. ఇక కాంగ్రెస్ సర్కారు ఇస్తామన్న ఒక్క పథకం కూడా ఇవ్వలేదు. దీనితో ఈ పాలనతో విసుగు అనిపిస్తు న్నది. అపుడు కేసీఆర్ సార్ ఉండంగ ఒక పథకం ఇస్తా మంటే ఇచ్చేస్తుండె. ఇప్పుడు రైతు భరోసా కూడా ఇగో అగో అని కాలం జరుపు తున్నరు. నాకే కాదు మా గ్రామంల అందరూ కాంగ్రెస్ పాలనపై నారాజుగ ఉన్న రు. ఇక మొన్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ వారు అచ్చి మా అసుంటోళ్లకు మస్తు ధైర్యం చెప్పిండ్రు.

*- నర్సింగు, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం.*



ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న రైతు ఆత్మహత్యల బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సభ్యులు

### పథకాలు వస్తయనే నమ్మకం లేదు..



కేసీఆర్ సారు రెండు పంటలకు సమయా నికి రైతుబంధు వేస్తుండె. అవి పెట్టుబడికి సరిపోతుండే. ఇపుడు రుణమాఫీ లేదు, రైతుభరోసాపై నమ్మకం లేదు. మా కుటుంబానికి మూడెకరాల భూమి ఉండగా.. మహారాష్ట్ర బ్యాంకుల రూ.2 లక్షల పంట రుణం ఉన్నది. గిప్పటికీ రుణమాఫీ కాలే. మండలంలోని ఒక్క గ్రామంలనే పథకాలు మొదలు పెడితే.. ఇగ మిగిలిన గ్రామాల గతి ఎట్ల. మిగతా గ్రామాలకు అందుతాయనే నమ్మకం లేదు.

*- మామిళ్ల గంగారెడ్డి, యాపల్‌గూడ, ఆదిలాబాద్ మండలం.*

---



నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

## హామీలు అమలయ్యే వరకూ పోరాడుతాం

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వేధిస్తున్నరు
- కేసులకు భయపడేది లేదు.. ఉద్యమ స్ఫూర్తితో కొట్లాడుతాం
- సీఎం దావోస్ పర్యటన అంతా బోగస్
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, జనవరి 26 : కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలయ్యే వరకూ ప్రజల పక్షాన పోరాడుతామని బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కేసులకు భయపడేదిలేదని, ఎన్ని కేసులు పెట్టిన ప్రజల పక్షాన నిలబడి తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సంపద పెంచి ప్రజలకు పంచితే.. కాంగ్రెస్ సంపదను పెంచకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. సీఎం దావోస్ పర్యటన అంతా బోగసేనని ఎద్దేవా చేశారు. ఆయన అనాలోచిత నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోయిందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ చెక్కు చెదరకుండా ఉందని, లేనిపోని కమిటీలు వేసి ప్రాజెక్ట్ లక్ష్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నీరుగారుస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎం, తన గురువు చంద్రబాబు కోసమే మేడిగడ్డ ప్రాజెక్ట్‌ను బలిచేస్తున్నాడని ఆరోపించారు. కలెక్టర్లను దూషించడం, ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై, నిజాలు రాస్తున్న విలేకర్లపై కేసులు పెట్టడం వంటివి చేస్తున్నారని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, నాయకులు డాక్టర్ రాజారమేశ్, రవీందర్‌రెడ్డి, అత్తి సరోజ, తిరుపతి, సంపత్, మధూకర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

## త్రివర్ణ సంబురం

- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండాలు ఆవిష్కరించిన కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, అవార్డుల ప్రదానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న స్టాళ్లు, శకటాల ప్రదర్శన



ఆసిఫాబాద్‌లోని పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ శ్రీనివాసరావు

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 26(నమస్తే తెలంగాణ)/మంచిర్యాల అర్బన్ : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో కలెక్టర్ కుమార్ దీపక్, ఆసిఫాబాద్‌లోని పరేడ్ మైదానంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సర్కారు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఆయాచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు దేశభక్తి గీతాలపై నృత్యాలు చేశారు. స్టాళ్లు, శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు ప్రదానం చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆయాచోట్ల మంచిర్యాల డీసీపీ భాస్కర్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

### ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో..

ఇక ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మంచిర్యాల, శ్రీరాంపూర్‌లలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ శ్రీనివాస్, ఆసిఫాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ ఆఫీస్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంచిర్యాలలోని జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాలలో గణతంత్ర దినోత్సవంలో విద్యార్థినుల ప్రదర్శన




మంచిర్యాల అర్బన్ : రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో జెండా వందనం చేస్తున్న సీపీ శ్రీనివాస్, పోలీసులు

## మంచిర్యాల జిల్లా అభివృద్ధికి పునరంకితం కావాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మీ సేవ కేంద్రాలు, కుల గణన సర్వే, ప్రజాపాలన కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించామన్నారు. గ్రామసభలు, వార్డు సభల్లో జాబితా చదివి వినిపించి ఎంపిక కాని వారి నుంచి మరోసారి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌లు అందించడం జరుగుతుందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, రుణమాఫీ పథకాలతో ఎంతో మందికి లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి, వేలాల రాజరాజేశ్వరస్వామి, ఎల్లంపల్లి జలాశయం, కవ్వాల్ అభయారణ్యం, గాంధారి ఖిల్లా, గాంధారి వనం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పథకాల కోసం అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం భూమిలేని రైతు కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. గ్రామ సభల ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున.. జిల్లాకు 7 వేల ఇండ్లు మంజూరు చేసిందని, సర్వే పూర్తిచేసి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.